


# జలస్వారి

-- కప్పగంతుల మల్లికార్జునరావు

"సహస్ర శీరుషా పురుషః సహ స్రాక్ష సహస్ర పాత్.' సత్యమూర్తికి కాస్తంత ఆలోచించే వ్యవధి చిక్కేది దేవతార్చన

కథా నిలయం
శ్రీకాకుళం



సమయంలోనే. అందుకే అతను దేవతార్చన మానడు.

ఆ సమయంలో, మంత్రం యాంత్రికం. మనసు మాత్రం చంచలం.

చేసేది 'ముష్టి' కాలేజీ లెక్చరర్ ఉద్యోగం అయినా, సత్యమూర్తి సంపన్నుడి క్రిందే లెక్క. కానీ పైకి మాత్రం కుచేలుడి వేషాలు వేస్తుంటాడు—సంపాదించింది ఎంతో ఉన్నా.

సర్వీసులో చేరిన కొత్తల్లోనే మంచి లెక్చరర్‌గా పేరు కొట్టేసేడు. ఆ పేరు స్థిరపడ్డాక, క్లాసులో కమ్మటి కబుర్లు, ట్యూషన్ చేరిన వాళ్ళకు పాఠాలు చెప్పేడు. ఇల్లు కూడా దాదాపు చిన్న సైజు కాలేజీగా మారేక పాఠాలు చెప్పకుండానే

ట్యూషన్ పిల్లల్ని పాసు చేయించే మార్గాలు అన్వేషించక తప్పలేదు.

"నాన్నా! పూలు."

కూతురు రాజేశ్వరి వైపు చూచి మందహాసం చేసేడు. అది అతని అలవాటు.వశీకరణ విద్యలో మొదటి మెట్టు.

పళ్ళెంలో ఓ పేపరు ముక్క, ఆ ముక్కలో పూలు.

'స్పాట్ వేల్యుయేషన్ సెంటర్లో తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి ఎక్కువ మార్కులు వేసి అవినీతి చర్యలకు పాల్పడ్డ ఎగ్జామినర్ సస్పెన్షన్. దర్యాప్తు సంఘం నియామకం.'

ఆ వార్త ఆ పొట్లం కాగితమంత పాతది. అయినా సత్యమూర్తి దృష్టి ఆ వార్త పైనే నిలిచిపోయింది. కురు వీరు లు ఒక్కొక్కరే యుద్ధరంగంలో కూలిపోతుంటే సుయోధనుడు చింతించినట్లు బాధపడిపోయాడు. గత కాలపు ఆలోచనలు కుమ్మరి పురుగులా మనసును తొలిచేయి.

సత్యమూర్తికి సర్వీసులో చేరిన రెండో సంవత్సరంలోనే ఎగ్జామినర్ షిప్పు వచ్చింది. అదంత సులభమయిన విషయం కాదు. మరెలా వచ్చినట్లు?

పోస్టులో పేపరు బండిల్సుతో పాటు, విశ్వనాథం కూడా ప్రత్యక్షమయ్యాడు!

"అబ్బాయ్—శివుడి జటాజూటంలో గంగను, స్మగ్లర్లలో నిజమైన పశ్చాత్తాపాన్ని, రాజకీయాల్లో నీతి నిజాయితీలను సాధించవచ్చేమో కాని, ఎగ్జామినర్ షిప్పు మాత్రం అంత సులభం కాదు. మరి నీకు అదెలా వచ్చిందో యీ పాటికి అర్థమయి వుండాలి!"

అయింది. కానీ చెప్పలేదు సత్యమూర్తి.

"సర్వీసులో చేరిన స్వల్ప కాలంలోనే యింట్లో 'మినీ' కాలేజీని స్థాపించిన నీ ప్రజ్ఞ నాకు నచ్చింది. విద్యార్థులు ట్యూషన్ ఎందుకు చేరుతారు? విజ్ఞానం కోసం కాదుగదా? డిగ్రీ కాగితం కోసం. మరి ఆ డిగ్రీ కాగితం ఎలాగో లాగు యిప్పిస్తే సరిపోలే?"

సత్యమూర్తి అప్పటికే విశ్వనాథం గురించి చాలా కథలు విని వున్నాడు. గురు భావాన్ని పెంచుకున్నాడు.

వారు చాలాకాలంగా చేస్తున్నది లెక్చరర్ వుద్యోగమయినా, దాన్ని గొప్ప బిజినెస్సుగా మార్చిన ప్రతిభాశాలి. అంతా 'మేడ్ ఈజీ' బహూ 'గైడ్ల' గ్రంథకర్త.

అవసరమైతే ఆ గైడుల అట్టలను మార్చేసి టెక్స్టు బుక్కులుగా అధికారులచే అప్రూవ్ చేయించ గల సమర్థుడు. ఎన్నో ఏళ్ళ అవిరళ కృషివల్ల అంచెలంచలుగా అన్ని కేంద్రాలలో పలుకుబడిని కాంక్రీటుతో నిర్మించుకొన్నాడు. ఆయన లేని కమిటీ వుండదు. ఆయనమీద ఈగవాలితే కంది రీగల్లా ఝామ్మని వొక్కసారి లేచి కుట్టటానికి ఆయన శిష్యులు వూదూరా వున్నారు. ధనార్జనను 'కళ'గా అభ్యసించి ఆరాధించే కళాకారుడు.

"అంచేత—మన విద్యార్థులంతా గ్యారంటుగా పాసయ్యే మార్గాలు అన్వేషించటం మన ధర్మం. ఏమంటావ్?"

సత్యమూర్తి అర్జునుడిలా మోకాళ్ళ మీదికి వంగి నమస్కరించాడు. కురుక్షేత్రంలో కృష్ణుడు గీతోపదేశం చేసినట్లు అప్పటి కప్పుడే వుపదేశం చేశాడు విశ్వనాథం. శిష్యుడికి దీక్షనిచ్చాడు.

ఆ క్షణంలో సత్యమూర్తి, తాను బుద్ధుడు, వివేకానందుడు, ప్లస్ బిర్లా అండ్ తాతాలంతా గొప్ప వాడయినట్లు అనుభూతి చెందేడు.

అనతి కాలంలోనే గురువును మించిన శిష్యుడని, గురువుచేత సర్టిఫికేట్ కూడా పొందేడు.

రిటైరయ్యాక కూడా విశ్వనాథంగారే కొంత కాలం వ్యాపారానికి మేనేజింగ్ డైరక్టరుగా వున్నాడు ఆయన చనిపోయాక ఈ వ్యాపారాని కంతటికీ సత్యమూర్తి వారసుడయ్యేడు.

కానీ గురుశిష్యుల వ్యాపార రీతుల్లో గణనీయమైన వ్యత్యాసాలున్నాయి.

విశ్వనాథం కోపిష్టి. చచ్చిందాకా దురుసు స్వభావం పోలేదు. ప్రైవేటు చేరకపోయినా, తన గైడు కాకుండా మరో గైడు తన విద్యార్థి 'ఫాలో' అయినా, ఫెయిల్ చేస్తానని క్లాసులోనే పబ్లిక్‌గా కుర్రాళ్ళను బెదిరించేవాడు. అంగళ్ళలో వస్తువుల ధరల పట్టికలను వేలాడగట్టినట్లు, ఫస్టు క్లాసుకింత, సెకండుక్లాసుకింత, థర్డుకింత, ఒక సబ్జెక్టు కయితే యింత—అని వోపెన్‌గా చెప్పేవాడు. నిత్యావసర వస్తువుల ధరల్తో పాటు, వుద్యోగుల జీతాలతో పాటు, ఆ రేట్లు కూడా పెరుగుతుండేవి దబ్బు దగ్గర అమిత నిక్కచ్చి.

సత్యమూర్తికి కోపం వస్తుంది. కానీ దాన్ని పైకి ప్రదర్శించడు. పెదిమల మీద ఆరిపోకుండా ఎప్పుడూ వెలిగే నవ్వు, తేనె

తుట్టలో నుంచి తేనెలా, మాటల్లో నుంచి జాలువారే మృదుత్వం ఆయన పుట్టుకతో సంపాదించు కొన్న వరాలు లాలిస్తూనే బెదిరించ టం, ప్రాధేయపడ్తూనే భయ పెట్టటం, ప్రేమను వొలకబోస్తూనే ద్వేషించటం ఆయన ప్రత్యేకతలు।

'శిష్యులు వృద్ధిలోకి రావాలని కాలేజీలోనే కాకుండా యింట్లోనూ పాఠాలు చెప్తుంటే, ట్యూషన్లు చెప్తున్నానని పుకార్లు—పిటీషన్లు। యింతకన్నా అన్యాయం వుందా? మీరే చెప్పండోయ్? నేను మీ దగ్గర డబ్బు తీసుకొంటున్నానా?'

నిజమే। తీసుకోడు. విద్యార్థులు కాలేజీకి కట్టాల్సిన డబ్బును ప్రభుత్వ ఖాతాలో బ్యాంకిలో చెల్లించినట్లు-సత్యమూర్తి యింట్లో లేనప్పుడు, ఆయన భార్యవద్ద జమ కట్టాల్సిందే!

'మేస్టరుకు బలం విద్యార్థు లోయ్. అలాగని నా మీద పిటీ షన్లు పంపేవాళ్ళ పని పట్టండని మీకు చెప్పటం లేదనుకో. కానీ గురు భక్తి మీది.'

విద్యార్థుల్ని యితర మేస్టర్ల మీదికి వుసికొల్పే విధానం అది।

నోరు తెర్చి అడగకుండానే విద్యార్థులనుంచి రకరకాల వస్తువ లను రాబట్టడంలో అతనికతనే సాటి. ఎన్నో కొత్త పద్ధతుల్ని కనిపెట్టేడు.

బద్ధశత్రువులతో సైతం పరు షంగా మాట్లాడడు. పిల్లి ఎదురు పడితే కూడా వంగి నమస్కరించి కుశల ప్రశ్నలు వేసే తత్వం.

'ఏమో। దాంతో ఎప్పుడేం పనొస్తుందో?'

సత్యమూర్తి జీవనసరళి ఇది. అదే అతని అభివృద్ధికి ఆయువు పట్టు.

* * *

"నాన్నా। ఆయన మళ్ళీ ఉత్తరం వ్రాశారు."

పూజలో ఉండగా సత్యమూర్తిని డిస్టర్బ్‌చేయకూడదన్నది నియమం. కానీ రాజేశ్వరి ఉండబట్టలేక పోయింది.

సత్యమూర్తి కూతురువైపు ప్రేమగా చూచి ఉత్తరాన్ని కింద పెట్టమని సంజ్ఞ చేశాడు. దేవతా ర్చన మంత్రాలు చెప్పుతూనే కళ్ళతో ఉత్తరాన్ని చదివాడు.

మామూలు ఉత్తరమే। కాక పోతే చివర్న ఓ బెదిరింపు ఘాటుగా ఉంది.

"ఈ ఉద్యోగం కూడా ఇప్పిం చకపోయారో మీ అమ్మాయికీ నాకూ చెల్లు."

సత్యమూర్తికి ఒక్కడేకొడుకు. ఇద్దరు కూతుళ్ళు.

మంచివాడుగా పేరు తెచ్చు కొన్న భానుమూర్తి 'ఎం.డి.' పూర్తయి డాక్టరై రెక్కలు రాగానే గొప్ప ఆదర్శవంతుడైపోయాడు. మతాంతర వివాహం చేసుకోటానికి, అమెరికా వెళ్ళటానికి తండ్రి ఎలాగూ అంగీకరించడని తెల్సేక తండ్రివి ఎవరూ అనవి మాట అన్నాడు.

"పిల్లల జీవితాలతో వ్యాపారం చేసే నువ్వా ఓ ఉపాధ్యాయుడి వేనా? నీలాంటివాడివి తండ్రి అని చెప్పుకోటానికి నాకు నామోషీగా వుంది. ఇకనైనా నీ పద్ధతులు మానుతానంటే ఈ ఇంట్లో వుంటాను. లేదా నీకు కొడుకు ల్లేరనుకో."

అది కేవలం ఓ మిష. సత్య మూర్తి ఆటో యిటో నిర్ణయించు కొనేలోగానే కిరస్తానీ పిల్లను చర్చిలో పెళ్ళి చేసుకొని అమెరికా వెళ్ళిపోయాడు.

సత్యమూర్తికి జీవితంలో అదో పెద్ద దెబ్బ. అయినా అలవాటైన నవ్వు నవ్వుతూనే భరించాడు. పెద్ద కూతుర్ని బోలెడంత కట్నం పోసి ఇంజనీర్‌కిచ్చి పెళ్ళి చేశాడు. ఆ పిల్లా కళ్ళముందు లేకుండా మొగుడితో ఉత్తరభారతానికి ఎగిరి పోయింది.

ఇక మిగిలింది రాజేశ్వరి. అందర్లోకి అర్భకురాలూ, కాస్తంత అనాకారీ ఆ పిల్లే. గట్టిగా తల్చు కుంటే ఆ పిల్లకూ డిగ్రీ కాగితం ఇప్పించేవాడే. కానీ అప్పటికే సత్యమూర్తికి చదువుపట్ల విశ్వాసం సన్నగిల్లింది. అంచేత పదో క్లాసు పెయిల్‌కాగానే రాజేశ్వరి చదువు మాన్పించేసి ఇంట్లో కూర్చోపెట్టి గారాబం చేశాడు.

డబ్బుపెట్టి ఆ పిల్లకు ఏ డాక్టర్నో, ఇంజనీర్నో, లెక్చ రర్నో మొగుడిని కొనిపారేయగల సత్తా వుంది. అయితే దానివల్ల ఏమిటి లాభం? ఆ పిల్లా కళ్ళ ముందునుంచి దూరమైపోతుంది. అంతేగా?

అంచేత, రాజేశ్వరి మొగుడి కోసం అతి జాగ్రత్తగా వెతికాడు. చివరికి రవీంద్రనాథ్‌ను పట్టు కున్నాడు.

రవీంద్రనాథ్ కలిగినింట పుట్ట లేదు. కేవలం సాధారణ గ్రాడ్యు యేట్. థర్డు క్లాసు. ఎవరిని విచా రించినా బుద్ధిమంతుడనే చెప్పేరు.

సత్యమూర్తి డబ్బును చూచి రవీంద్రనాథ్ తల్లిదండ్రులు ఆశ పడ్డారు. పిల్లను చూశాక అతను

అంగీకరిస్తాడో లేదోనని అందరికీ అనుమానమే।

"చూడు నాయనా। నీతో పోలిస్తే రాజేశ్వరి అందగత్తె కాదు. అయితే అందం వయసుతో పాటు క్షీణిస్తుంది. క్షీణత లేనిది-మనసు, మంచితనం. యీ రెంటికన్నా ముఖ్యమైనది మరోటి వుందనుకో. డబ్బు ఆశ పెడ్తున్నాననీ, అవమాన పరుస్తున్నాననీ అనుకోనేవు। అలా వొక్క నాటికీ చేయను. నేను వుపాధ్యాయుడిని. పిల్లలంటే అమిత ప్రేమాభిమానాలు కలవాడిని. అంచేత ప్రేమతో చెప్తున్నా- నా డబ్బు నీది. కూర్చొని తింటావో, వ్యాపారం చేసుకొంటావో నీ ఇష్టం. నాక్కావల్సింది నువ్వూ అమ్మాయీ సుఖంగా వుంటటం. అందుకు ఏం చేయటానికైనా సిద్ధమే."

అంతవరకు మెదలకుండా కూర్చున్న రవీంద్రనాథ్ మరుగ్గా ఆయన వైపు చూసాడు. మెల్లగా విదానంగా అన్నాడు___

"మళ్ళీ నేను పరీక్షకు కూర్చో కుండా, నా థర్డు క్లాసు బి. కాం. డిగ్రీని ఫస్టుక్లాసు డిగ్రీగా మార్చే ఏర్పాటు చేయగలరా?"

కాపీ కొడ్తుంటే మాస్టరు పట్టు కొన్నప్పటి కుర్రాడిలాగయ్యాడు సత్యమూర్తి।

రవీంద్రనాథ్ మెల్లగా నవ్వేడు

"ఆల్‌రైట్। మీ అమ్మాయిని చేసుకొంటాను. కానీ మీ డబ్బు నాకెందుకికాదు. నా వెర్రి నా కానందం కనుక।"

సత్యమూర్తి ఆనందించాడు. తన పాచిక పారినందుకు గర్వించాడు. కానీ అవన్నీ మూడు నాళ్ళ ముచ్చటే। నాలుగో నాడు పిల్లను తన వెంట తీసుకు పోవటానికి పేచీ పెట్టేడు.

'బ్యాంక్‌లో పెద్ద ఆఫీసరవు దామని బి.కాం. చదివేను. దరఖాస్తు పెట్టే అర్హతన్నా లేకుండా థర్డు క్లాసు వచ్చింది. నేను బ్యాంకీ ఆఫీసర్ని కావాలి. పెళ్ళాన్ని తీసు కెళ్ళాలి. అందాకా యింతే'

అంతే। ఎప్పుడు రాసినా యివే మాటలు.

రాజేశ్వరికి నెలకు రెండు సార్లు వుత్తరాలొస్తాయి. కానీ వొక్క వుత్తరంలో కూడా పలకరింపులు, ముద్దూ-ముచ్చట్లు ఏమీ వుండవు. ఉద్యోగం. ఉద్యోగం..అప్లై చేసిన వుద్యోగ వివరాలు. పెళ్ళానికి రాయాల్సిన వుత్తరాలేనా?

"నాన్నా। ఈ సారన్నా ఆయనకి వుద్యోగం ఇప్పించు నాన్నా।"

ఎన్నో సార్లు ప్రయత్నించేడు.

కానీ ఏనుగును అగ్గిపెట్టెలో ఇమడ్చటం సాధ్యమా?

'సీటు యిప్పిస్తాను. యం కాం చదవర్రాదూ? ఫస్ట్ క్లాసు వచ్చేలా చూస్తాను.'

'వచ్చిన చదువును గూర్చి కాదు నా తాపత్రం. చదవకుండా, క్లాసులు రాకుండా ఆఫీసర్ వుద్యోగం రావాలి.'

యింటి దాకా వెళ్ళి అడిగితే యిదీ సమాధానం. యిదేం పిచ్చి?

"ఏం నాన్నా యిప్పించవూ? మొగుడు బతికుండగా ఎన్నాళ్ళని వెధవముండలా బతకను నాన్నా?"

"అమ్మా!"

కూతురు అంత మాటన్నాక సత్యమూర్తి కిక దేవతార్చన మీదికి బుద్ధి పోలేదు. ఆలోచనల మీదికి మనసు లగ్నం కాలేదు. భారతం లాంటి టెక్స్టు బుక్కుకు, ఎక్కాల పుస్తకం సైజు గైడు రాసినట్లు దేవతార్చన అయిందనిపించి లేచాడు.

"ఎంత మాటన్నావమ్మా! నేను బ్రతికుండగానేనా నీకీ బేలతనం?" రాజేశ్వరిని అక్కున చేర్చుకొని బుజ్జగించాడు.

"యిది మొన్నటి వుత్తరం నాన్నా! యివాళ వచ్చిన పుత్తరం యిదుగో."

కళ్ళనిండా నీళ్ళు—మొహం నిండా విచారం-గుండెల్లో నుంచి ఎగిసి కొట్టుకున్న వేదన—తండ్రి చేతుల్లో వుత్తరం పెట్టి నిలవలేనట్లు వెళ్ళింది.

"రాజేశ్వరీ...

నిన్నిలా ఏడిపిద్దామని పెళ్ళి చేసుకోలేదు. విధికృతమేమో! నీ మెళ్ళో మంగళసూత్రం కట్టిన మూడో నాడు నాకో విషయం తెల్సింది.

నేను బీదవాడిని. అయితే అడ్డదారులు తొక్కి ధనవంతుడిని, గొప్ప వాడిని కావాలని ఎన్నడూ ఆశించలేదు. రాజమార్గాన్నే నడిచేను. ప్రతి క్లాసులో ఫస్టు మార్కులు సంపాదించుకొన్నాను.

కారణాలు చెప్పలేను కాని-బ్యాంక్‌లో ఆఫీసరు కావాలని చిన్నతనం నుంచి ఎందుకో కలలు కంటుండే వాడిని. అందుకు అనుగుణంగా బి.కాం. లో చేరేను. ఫస్టుక్లాసు—యూనివర్సిటీ ఫస్టు నా గమ్యం. ఆ గమ్యం చేరగానే వుద్యోగం సంపాదించి నా వాళ్ళను ఆదుకోవాలి.

యిలా వుండగా మా కామర్సు లెక్చరర్ నన్నో రోజు పిలిపించేడు.

'ఏమోయ్! క్లాసుకు ట్రై చేస్తున్నావటగా? గుడ్! కానీ

చదవగానే క్లాసు లొస్తాయా? కోచింగ్ వుండొద్దూ? నా గైడ్ ఫాలో అవుతున్నావా? ఫస్టుక్లాసు కావాలంటే ట్యూషన్లో చేరాలి మరి.' అన్నాడు.

నేనెన్నడూ గైడు పుస్తకాలను ఫాలో కాలేదు. ట్యూషనుకు చేరే శక్తిలేదు. అవసరమూలేదు.

ఆ మాటే అన్నాను. ఆయన అదోవిధంగా నవ్వి వూరుకొన్నాడు.

పరీక్షలు దగ్గర కొస్తుండగా అంతా నన్ను భయపెట్టేరు.

ఆ మేస్టారుతో తగాదా పులితో పోరాటం, పాముతో చెలగాటం!

ఆయన్ని ప్రసన్నుడిని చేసుకోటానికి ప్రయత్నించాను. నేనంటే అభిమానించే మేస్టర్ల చేత నా స్థితిని చెప్పించాను.

పరీక్షలయి పోయాయి. ఫలితాలొచ్చాయి.

ఫస్టుక్లాసు వస్తుందను కొన్న నాకు బొటా బొటీ ముప్పైఅయిదు మార్కులు! ఫెయిలవుతారను కొన్న వారికి ఫస్టుక్లాసులు!

గురువులమీద, పరీక్షల మీద, విద్యా విధానంపైనే నాకు నమ్మకం పోయింది. శరీరమంతా నిస్పృహ ఆవరించింది.

ఆయితే లోకమంతా వొక్క తీరునే వుండదుగా? లెక్చరర్లంతా ఆయనలాంటి వారే కాదుగా? నా పట్ల అభిమానం వున్న లెక్చరర్లు కొందరు నాకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని ఎంతో ప్రయత్నించారు. అయితే యూనివర్సిటీ పరీక్షల రూల్సులన్నీ మాస్టర్లకనుకూలంగా అష్టదిగ్బంధనం చేసి వుంచేరు. అంచేతలాభం లేకపోయింది.

కానీ నా కథంతా తెల్సుకోగలిగేరు. వలపన్ని ఆ మాస్టరు అవినీతికి పాల్పడు తుంటే పట్టించారు. వూరూరా వున్న ఆ'కాకస్' సభ్యుల గోత్ర నామాలు తెల్సుకొన్నారు.

ఆ 'కాకస్'కు సూత్రధారు డెవరో తెల్సా? మీ నాన్న. నా మావ గారు!

ఫస్టుక్లాసు రావల్సిన నాకు థర్డు క్లాసు మార్కులు వేసిన వాళ్ళలో నా మామగారూ వొకడు!

తండ్రి తప్పుకు కూతుర్ని శిక్షించటం న్యాయం కాదు. కాని నాకు అన్యాయం చేసిన వారేనాకు న్యాయం చేయాలి. మరో అన్యాయం చేసైనా సరే నా కోరిక నెరవేర్చాలి. తప్పు చేయటం అంత సులభకాదు-చేసిన తప్పును సరిదిద్దు కోవటం అని అప్పుడే తెల్సి

వస్తుంది. నా తర్వాత వారన్నా బాగుపడ్తారు.

ప్రస్తుతం అప్లై చేసిన పోస్టు వివరాలు మొన్నటి వుత్తరంలో రాశాను యిదే ఆఖరు అప్లికేషన్. అల్లుడిని బ్యాంక్ ఆఫీసరుని చేయటానికి మీ నాన్నకు ఆఖరు ఛాన్సు యిదే. యీ అప్లికేషన్‌కూ పూర్వపు వాటి గతే పడ్తే—పెళ్ళాం వుండీ నేను సన్యాసిని, మొగుడు వుండీ నీవు....రవీంద్రనాథ్."

ఉత్తరం చదవగానే కుప్పకూలిపోలేదు సత్యమూర్తి. బుర్ర పెద్ద ఫేక్టరీ అయింది. యంత్రాలు గోలగా శబ్దాలు చేస్తున్నాయి.

అనర్హులెందర్నో తను పాసు చేయించి వుండవచ్చు. కానీ అర్హుల్ని ఫెయిల్ చేయించాల్సిన అవసరం కలగలేదు. దానికి వ్యతిరేకి.

'నా తప్పులవల్ల నాకు లాభం. నిజమే. కానీ మరో పదిమందికి మేలే జరుగుతోంది. కానీ కీడు జరగటం లేదెవ్వరికీ. భగవంతుడంటూ వుంటే నాకు స్వర్గమే కేటాయించాలి' అని తన మనసుని తాను సమాధాన పర్చుకొంటుండేవాడు.

ఆ విషయం దగ్గరే సత్యమూర్తికి చిట్టిబాబుకూ చుక్కెదురు. గురువు విశ్వనాథంగారి నాయకత్వ లక్షణాలు, డైనమిజమ్ అబ్బలేదు కానీ, చిట్టిబాబుకు ఆయన చెడుగుణాలన్నీ అలవాటుపడ్డాయి. కోపం....పగ.

అతని బలవంతం మీదే ఒకసారి చేజేతులా ఓ విద్యార్థిని అన్యాయం చేశాడు. ఆ విద్యార్థి తన అల్లుడా!!

'చెప్తే విన్నావు కాదు చిట్టిబాబూ! నీ కన్ను పొడుచుకొన్నావ్. నా కన్నూ పొడిచేవ్. ఛీ....'

అని అనుకొంటూ, గాలికి డాన్స్ చేస్తున్న పొట్లాం కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చించివేశాడు.

* * *

ప్రధానమంత్రి తాలాలన్న కోరికతో పైసా డబ్బులు చేతిలో లేకుండా పార్లమెంటు సభ్యత్వానికి నామినేషన్ దాఖలు చేసినట్లు, కేవలం డబ్బు మాత్రమే పుష్కలంగా పట్టుకొని వేటకు బయలుదేరేడు సత్యమూర్తి. డబ్బు లేనివాడు గ్యారంటీగా ఎలక్షన్‌లో గెలవడంతే అప్పుడు సత్యమూర్తి ఛస్తే అంగీకరించడు.

అలాగే, అల్లుడికి ఆఫీసరయ్యే విద్యార్హతల్లేక పోవచ్చు. కానీ అందరూ అర్హతలుండే ఆఫీసర్లు అవుతున్నారా అన్నది ఆయన

వేసుకొన్న ప్రశ్న. కాలేజీ లెక్చరర్‌గా వుంటే, పిల్లల పురోభివృద్ధికి తాను సేవ చేస్తున్నట్లే, బ్యాంకుల్లో కూడా ఏ మహానుభావుడో అర్హతల్లేని వారికి వుద్యోగాలిప్పిస్తూ, బలహీన వర్గాలవారికి ఎందుకు సేవ చేస్తుండకూడదు?

హైదరాబాద్‌లో రైలు దిగీ దిగగానే అతని వూహా రైటని రూఢీగా తెల్సింది. లెక్కింపులో మొదటి ఓటు తనది కాగానే గెల్చేసినట్లు సంబరపడిపోయే అభ్యర్థిలాగయి పోయాడు.

ఆ ఆఫీసరెవరో తన స్టూడెంటు అయివుండే అవకాశం మెరుగు బడ్డాక, పార్లమెంటు మెంబరు అయినట్లే పొంగిపోయాడు. అతని ఏజెంట్లను పట్టుకొని బేరాలు కుదిరించుకొని అడ్వాన్సు యిచ్చి, యింటర్వ్యూ టైమ్ ఫిక్సు చేసుకొన్నాక మంత్రి అయినట్లు సంబరపడ్డాడు.

'అంతా రాజేశ్వరి అదృష్టం' అనుకొంటూ, ప్రధానమంత్రి పదవికి పోటీ లేకుండా ఎన్నిక కాబోతున్న వాడిలా ఆఫీసరు ఇల్లు చేరేడు.

అదో పెద్ద భవనం. ముందో చిన్న తోట. పోర్టికోలో పెద్ద కారు. వరండాలో సోఫా మీద, సింహంలాంటి వో కుక్క చక్రవర్తిలా ఠీవిగా కూర్చునివుంది. అయినా అతను భయపడలేదు. బెదిరిపోలేదు.

ప్రధానమంత్రి, రాష్ట్రపతి వద్ద కెళ్ళేటప్పటంత హుందాగా భవనంలోకి ప్రవేశించాడు. కుక్క అతడిని చూచి మొరగలేదు. అతని పాదాల్ని, చేతుల్ని వాసన చూచి, వచ్చిన పనిని, యిచ్చిన డబ్బును పసిగట్టేసినట్లుంది. రెండుమార్లు అతనిచుట్టూ ప్రదక్షిణంచేసి, గౌరవంగా అతడిని సోఫాలో కూర్చోబెట్టి లోపలికెళ్ళింది.

ఆ ఒక్క కుక్క వందమంది సేవకుల పనిచేస్తున్నట్లు కన్పించింది. కుక్క విశ్వాసమైన జంతువే కాదు—నమ్మకంగా పని చేసేది కూడా!

పదినిముషాల తర్వాత కుక్క వచ్చి లోపలికి తీసికెళ్ళింది. ఇంద్ర భవనంలోకి అడుగుబెట్టినట్లనిపించింది సత్యమూర్తికి!

తను ఎంతో సంపాదించేసినట్లు అందరికీ అసూయ—మాత్సర్యం! కానీ ఆవగింజలో అర్ధభాగం మేరకే చూచిన ఆ భవనంతో పోలిస్తే తన ఐశ్వర్యం ఏ పాటి!

తను ప్రయోజకుడన్న గర్వం ఏపాటి వున్నా అది కాస్తా ఆ

క్షణంలో 'హూశ్ కాకీ' అన్నట్లు మాయిమయింది. పీ ర స ం! నిస్పృహ!

కుక్క అతడిని వో పెద్ద ఏర్ కండిషన్డ్ గది లో కి తీసికెళ్ళి కూర్చోబెట్టింది. అది బయటకు వెళ్ళగానే తలుపులు మూసు కొన్నాయి.

గది చూడటానికి రెండు కళ్లూ చాలటంలేదు. శిల్పాలు—చిత్రాలు. సన్నగా సంగీతం-కమ్మటి వాసన!

తలుపులు తెరుచుకొని మూసు కొన్న ధ్వని మెత్తటి తివాసీ మీద మృదువైన స్లిప్పర్ల చప్పుడు.

"నమస్కారం సార్!" చటుక్కున లేచి చేతులు జోడించి, అతడిని చూచి ఆగిపోయాడు!

ఆశ్చర్యం! ఆనందం! అతని వూహకు మరో మారు ఘన విజయం!

కిరణ్ కుమార్ సత్యమూర్తికి బాగా గుర్తుండే విద్యార్థి.

అతడికి డబ్బు, పలుకుబడి పుష్కలంగా వున్నాయి. బుర్ర లేదనటానికి వీల్లేదు. అయితే చదువుకు, అతని బుర్రకు చుక్కెదురు. క్లాసు పుస్తకాలంటే అతనికి గొప్ప చిరాకు చిట్టా ఆవర్జాలంటే చిన్ననాటినుంచీ ప్రేమ!

అతనికి ఫస్టుక్లాసు బి. కాం. డిగ్రీ కావాలి. ఆ రేటుకు బోనస్ కలిపి ముందే చెల్లించిన బుద్ధిమంతుడు. ట్యూషన్‌కి 'రేర్'గా వచ్చేవాడు. వచ్చిన రోజు వొట్టి చేతుల్తో వచ్చేవాడు కాదు. అటువంటి మర్యాదలు చిన్నతనంనుంచే అలవడ్డాయి. పండుగ పండక్కీ గురువుగారింట్లో అందరికీ ఏదో బహుమానం అడక్కుండానే పట్టుకొచ్చి యిచ్చే బెస్ట్ స్టూడెంట్.

పరీక్షలముందు కిరణ్ సత్యమూర్తికి పెద్ద సమస్య తెచ్చిపెట్టేడు.

"తెల్ల కాగితాల్ని ఏదో రాసి నలుపుచేసి రండి—" అన్నది ట్యూషన్ విద్యార్థులకు సత్యమూర్తి ఎప్పుడూ చెప్పే వొక పాఠం. అదీ చేయలేనని మొరాయించాడు కిరణ్.

మొదట్లో చిరాకేసినా, కిరణ్ తెచ్చిన బహుమతుల్ని చూసి ప్రసన్నుడయ్యాడు. "పుస్తకాలు చూసైనా సరే ఏదో వొకటి రాయక తప్పదు. తెల్సిందా?" అని బెదిరించి, ఆ ఏర్పాట్లు చేశాడు.

ఫస్టుక్లాసు వచ్చిన రోజు వెండి కంచం ప్రెజెంట్ చేస్తూ అన్నాడు కిరణ్- "కుర్రవాళ్ళకి గొప్ప సేవ చేస్తున్నారు మాస్టారూ! లేకపోతే నాకేంటి? ఫస్టు క్లాసు డిగ్రీ ఏమిటి?

డిగ్రీ విజవ ఇంత చీప్ అని నాకు తెలియదు. మీ శిష్యరికంలో చాలా నేర్చుకున్నాను సార్! ఆచరణలో పెట్టగల శక్తి కలిగేలా ఆశీర్వదించండి."

తన ఆశీర్వాదానికి ఇంత గొప్ప శక్తి వుందా?

"కూర్చోండి మాస్టారూ! అలా నిలబడిపోయారేం?"

కిరణ్ అప్పటికే ఎదుటి సోఫాలో దర్జాగా కూర్చున్నాడని గ్రహించాడు సత్యమూర్తి. బెంచీ ఎక్కిన విద్యార్థి మాస్టారు కూర్చో మనగానే చటుక్కున కూర్చున్నట్లు సోఫాలో కూర్చున్నాడు. అంతలోనే సత్యమూర్తి సీనియర్ లెక్చరర్ అయ్యాడు. ఒకప్పుడు తన అనుచరుడూ, ప్రత్యర్థి వర్గంలో చేరిపోయిన ప్రస్తుత మంత్రిని, మాజీ ముఖ్యమంత్రి పలకరించినట్లు కుశల ప్రశ్న లేశాడు.

"చాలా రోజులయిందోయ్ నిన్ను చూచి! బాగున్నావా కిరణ్? నా విద్యార్థివై నందుకు పైకొచ్చావ్. చాలా సంతోషం."

కిరణ్ మాట్లాడలేదు. పత్రికా విలేఖరుల గోష్ఠిలో పార్టీ మారుతున్నట్లు అప్పుడే ప్రకటించిన ప్రముఖనాయకుడి మొహంలా, ఏ భావం లేకుండా అతని మొహం 'కూల్' గా వుంది. హుందాగా పక్కనున్న స్విచ్ నొక్కాడు. తెల్లబట్టల మనిషి ఒకడొచ్చాడు.

"జాన్! మా మాస్టారుగారు వీరు. స్పెషల్ కాఫీ, టిఫెన్ పట్టుకురా. ఈ పూట భోజనం చేస్తారని రహీంకు చెప్పు."

తన సంగతి తెల్సి అలా అంటాడేం? ఆటలాడటం లేదుగదా?

"చెప్పండి మాస్టారూ! హైద్రాబాద్ ఏం పనిమీద వచ్చారు?"

అడ్రస్సు కూడా తీసుకొని, ఏమీ తెలియనట్లు అలా అడుగుతాడేం? చెప్పిన పాఠం అర్థం కాలేదన్న కుర్రాడిని చూచినట్లు చూచాడతని వైపు. మనసులో చిరాకు పడ్డాడు. అయినా వచ్చినట్లు వచ్చిన పనిని వివరించాడు.

"ఓ! యూ మీన్ బిజినెస్!" కిరణ్ హఠాత్తుగా బిగుసుకుపోయాడు.

"బిజినెస్సేమిటోయ్? గురువు-శిష్యుడి గొప్పతనం తెల్సి సహాయం అడగడానికి వచ్చాను. ద్రోణాచార్యులవారు అడగ్గానే వేలు కోసిచ్చిన ఏకలవ్యుడిలా గురుభక్తిని, ఇంద్రుడు కవచకుండలాలడగగానే ఇచ్చేసిన కర్ణుడిలా, ఔదార్యాన్ని, గొప్పతనాన్ని,

నువ్విప్పుడు ప్రదర్శించాలి. నా ప్రాణాన్ని, నా కూతురు కాపురాన్ని నిలబెట్టాలి" అంటూ అల్లుడి కథంతా దీనంగా చెప్పేడు.

"సో...." అంతా విని తాపీగా లేచాడు కిరణ్.

"ఉద్యోగం అవసరం మీకిప్పుడు ఎక్కువగా ఉందన్నమాట! 'నీడ్' ను బట్టి 'డిమేండ్.' డిమేండును బట్టి ధరలు పెరుగుతాయని మీకు నేను చెప్పక్కర్లేదనుకొంటా. మా బిజినెస్‌లో ఇటువంటి కేసునింత వరకూ చేపట్టలేదు. మీదే ఫస్టు. బేరమాడనంటే ఖరీదు చెప్తా!"

ప్రమాణ స్వీకారం చేసిన పది రోజుల్లో మంత్రిత్వం పోయిన వాడిలాగయ్యాడు సత్యమూర్తి. పార్టీ మారితే తిరిగి పదవిని పొందవచ్చునన్న ఆశలా, డబ్బు ఎక్కువపోయానా పని అవుతుందన్న ఆశ! బిల్లు ఏమిటో తెలియక పోయినా పార్టీ 'విప్' ప్రకారం చేతులెత్తినట్లు, సరేనని తల వూపేడు.

"మీ అల్లుడికి ఆఫీసరు ఉద్యోగం ఈజ్ ఈక్విలెంట్ టు - మీ యావదాస్తి."

'గురువు నన్న గౌరవాన్నైనా వుంచకుండా మాష్టారిలా మాట్లాడేవాయ్! మరీ యింత దారుణమా? ఆశకు అంతు వుండొద్దూ? నా నుంచి నేర్చుకొంది యిదేనా?' అరుద్దామనుకొన్నాడు. కానీ ధైర్యం చాల్లేదు.

కిరణ్ చిత్రంగా నవ్వేడు.

"మీ ఆలోచన మీ మొహంలో కనిపిస్తోంది మాష్టారూ! కానీ బిజినెస్సులో బంధుత్వాలేమిటి? నాకో న్యాయం, మీకో న్యాయం వుంటుందా? పెట్టిన పెట్టుబడి మీద వీలైనంత సంపాదించటమే వ్యాపారమని, వ్యాపారస్తుడి లక్షణమని, మీరు నేర్పిన పాఠమే కదా? మీ డిగ్రీని ఉద్యోగాన్ని, అధికారాన్ని పెట్టుబడి చేసుకొని మీరు ఎన్ని రూపాల్లో విద్యార్థుల దగ్గర డబ్బు గుంజేరో నాకు తెలియదా? డిగ్రీ సంపాదించటానికి అంత పెట్టుబడిని పిచ్చోడి నయ్యే పెట్టేననుకొంటున్నారా?"

"బుద్ధొచ్చింది బాబూ! మంచి గుణపాఠం నేర్పేవు. అణాపైసల్తో సహా నీ డబ్బు తీసుకో. యిక నుంచి యీ పులిస్వారి చేయను."

కిరణ్ పగలబడి నవ్వేడు.

"మీరు వ్యాపారం మానేస్తే నాలాంటి వాళ్ళంతా ఏమయ్యేటట్లు మాస్టారూ? పైగా ఎంతమందికని ఋణాలు తీర్చగలరు? నేర్చుకొన్న పాఠాల్ని తిరిగి మీకు వప్పచెప్ప

గలనేమో కాని, మీకు (గుణ) పాఠాలు నేర్పేటంత వాడివి కాను. అయినా మాస్టారూ—మీ లాంటి వాళ్ళు, నాలాంటి వాళ్ళు పులిస్వారి చేయకపోతే ఎవరు చేస్తారు? గుఱ్ఱబ్బండిలో పోవటంలో మజా ఏముంది? పులిస్వారిలోనే థ్రిల్. సాగినంతకాలం మీ జోలికి ఎవ్వరూ రాలేరుగా? పులే తిరగబడి మింగినప్పటి సంగతి కదా? చూదుకొందాం. అంచేత మనలాంటి వాళ్ళ స్వారి సాగినంతకాలం. మీ అల్లుడి లాంటి వాళ్ళు బాధపడక తప్పదు. పులి స్వారీ చెయ్యాలీ—మేకలూ భద్రంగా వుండాలంటే ఎలా కుదురుతుంది? కనుక ఏడుపులూ, ప్రాధేయ పడటాల్లోకి మనం పోవద్దు. నా ప్రపోజల్ మీ కంగీకారమైతే వివరాలు మా ఏజంట్‌ను కల్సి మాట్లాడండి. గుడ్ బై!"

గదిలో వున్న వస్తువుల నన్నింటినీ చిత్తు చిత్తుగా ధ్వంసం చేసి పారేయాలనీ, పెట్రోలు పోసి ఆ భవనాన్నే కాల్చి పారేయాలన్నంత కోపం-కచ్చ!

చేతికందిన వస్తువును పట్టుకొన్నాడు. కాళ్ళకు మెత్తటి స్పర్శ!

కుక్క! పులిలా, సింహంలా చూస్తోంది. వస్తువును వదిలేసేడు. కానీ కాళ్ళు కదల్లేదు.

వాకిట్లోకి పోయి ఏం చేసేటట్లు? అల్లుడి కాళ్ళు పట్టుకోటమా? కూతురు కన్నీళ్ళు తుడవటమా?

ఆస్తి—కూతురు—సంసారం! ఏది ముఖ్యం?

కుక్క అరిచింది.

సత్యమూర్తికి తను సంపాదించిన ఆస్తి భుజంగ మాలలా, ఆస్తికల తోరణంలా కన్పించింది.

ఆస్తిని క్రెడిట్ కాలం నుంచి డెబిట్ కాలంలోకి మార్చాడు. కూతురు సంసారాన్ని, సుఖాన్ని క్రెడిట్ కాలంలోకి వచ్చుయింకుతో రాసేడు.

ఉన్నట్లుండి కుక్క పులిలా సత్యమూర్తి పైకి దూకింది.

రాగానే గౌరవించి రిసీవ్ చేసుకొన్న కుక్క కాదది. కుక్క, రూపంలో వున్న కామధేనువు అది. యిప్పుడు యీ కుక్క, కుక్క రూపంలో వున్న పులి! భయమేసింది.

తలుపు తీసుకొని బయటికి పరుగెత్తేడు. దొంగతనంగా అన్నం తినటానికొచ్చిన వూరకుక్కను యజమాని తరిమినట్లు, కుక్క సత్యమూర్తిని గేటవతలవాకా తరిమింది.

గేటు దాటేకకూడా సత్యమూర్తి భయంతో పరుగెత్తుతూనే వున్నాడు.

కుక్క మాత్రం ఆగిపోయి, విజయ గర్వంతో, చక్రవర్తిలా, తిరిగి సింహాసనం ఆక్రమించుకొని కూర్చుంది!